క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి

అడ్డతీగల: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు అందరూ కలిసి ఘనంగా నిర్వహించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు), మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

గూడెంకొత్తవీధి/కొయ్యూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించేందు వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నద్ధమయ్యారు. కొయ్యూరు మండలంలోని నల్లగొండలో మంగళవారం నిర్వహిస్తున్న వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ నాయకులు, చింతపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ రాజులమ్మ కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



గ్రామస్తులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ సాదిక్

మోతుగూడెం: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోతుగూడెం పీఎస్ పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ వేముల రాయి గ్రామంలో సోమవారం ఎస్‌ఐ సాదిక్ , సిబ్బంది సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు, గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. యువత మంచి మార్గంలో పయనించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్తులకు దుస్తులు పంపిణీ చేశారు.

పశువైద్యాధికారిగా సౌజన్యదేవి నియామకం

చింతపల్లి: మండలంలో లోతుగెడ్డ పశువైద్యాధికారిగా మత్స్యరాస సౌజన్యదేవి నియమితులయ్యారు. తాజా బదీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన దమయంతికి అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యింది. ఆమె స్థానంలో ముంచంగిపుట్టు మండలం కిలగాడలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సౌజన్యదేవికి ఇక్కడికి బదిలీ అయ్యింది. ఈ మేరకు ఆమె సోమవారం విధుల్లో చేరారు.

మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చింతపల్లి: మండలంలోని లంబసింగి పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోవిద్యార్థులకు ఉచితంగా నారసంచులను సీఫా ట్రస్టు సీఈవో డాక్టర్ శశిప్రభ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి పర్యావరణం , మొక్కలు పెంపకం వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మొక్కలను విస్తృతంగా నాటాలన్నారు. హెచ్‌ఎం సతీష్, గ్రీన్ క్లయిమేట్ టీం ఎన్‌జీవో కార్యదర్శి జేవి రత్నం, సీఫా సిబ్బంది నర్సింగ్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, భాస్కర్, లక్ష్మి పాల్గొన్నారు.

చట్టాలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను

ముంచంగిపుట్టు: ఆదివాసీ చట్టాలు,హక్కులను కాలరాస్తూ కూటమి ప్రభుత్వం బడా వ్యాపార వేత్తలకు అనుమతులు జారీ చేయడం తగదని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో సోమవారం పీసా సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతగిరి మండలం టోకురు పంచాయతీ చిట్టంపాడులో అదానీ కంపెనీకి హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతి ఇస్తూ జారీ చేసిన జీవో 51ను పీసా సభ్యులు వ్యతిరేకించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ ఆదివాసీల అంగీకారం, గ్రామసభలో తీర్మానం లేకుండా కూటమి ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్టుకు జీవో 51ను జారీ చేయడం అన్యాయన్నారు. రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో ఉన్న చిట్టంపాడు ప్రాంతంలో అటవీ హక్కుల చట్టం,పీసా చట్టం అమలులో ఉంటాయని,రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘించడం తగదన్నారు. జీవో నంబర్ 51 చట్టపరంగా చెల్లదని చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 51ను రద్దు చేయాలని,లేకపోతే ఆదివాసీల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. సుబ్బారావు, పద్మనాభం, నీలకంఠం పాల్గొన్నారు.

దారుణ దారులు



చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో గోతులమయమైన రహదారి

- అడుగుకో గొయ్యితో ప్రయాణం నరకం
- 3 కిలోమీటర్లు 150 గోతులు
- ప్రయాణం ఫీట్లే..తప్పని పాట్లు

: మండల కేంద్రానికి కూటవేటు దూరంలో ఉన్న చౌడుపల్లి–పసువులుబంద రోడ్డు దారుణంగా ఉంది. చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల పరిధిలోని అయిదు పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగించడానికి ఈ మార్గమే ప్రధాన రహదారి. చౌడుపల్లి పంచాయతీ కేంద్రం నుంచి జెర్రల, వంచుల, మొండిగెడ్డ ,కుడుముసారి, బలపం పంచాయతీలకు చెందిన వంద గ్రామాలకు పైగా గిరిజనులు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తుంది.

అధ్వాన రోడ్డుతో రూటుమార్చిన బస్సు

చింతపల్లి నుంచి చౌడుపల్లి మీదుగా జెర్రల–మొండిగెడ్డకు రోజూ ప్రయాణికులు సౌకర్యార్థం నర్సీపట్నం డిపోకు చెందిన బస్ సర్వీసు రాకపోకలు సాగించేది.దాంతో చింతపల్లి,జీకే వీది మండలాలకు చెందిన అనేక గ్రామాలు ప్రజలకు ప్రయాణం సాగించేందుకు ఎంతో అనుకూలంగా ఉండేది. చౌడుపల్లి నుంచి జెర్రల ఘాట్ వరకూ ర హదారి పూర్తిగా ఛిద్రంగా తయారైంది. దీంతో ఈ ప్రాంతం మీదుగా బస్ సర్వీసు రాకపోకలను పూర్తిగా బంద్ చేశారు.

ఫలితంగా స్థానికులకు కాలి నడకే శరణ్యమైంది. ఈ రోడ్డు మీదుగా సాహసం చేసే ద్విచక్ర వాహనదారులు పరిస్థితి వర్ణానాతీతం. ఈ గోతుల్లో సర్కస్ ఫీట్లుతో ప్రయాణం చేస్తూ పడుతూ లేస్తూ అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రూట్‌లో బస్ సర్వీసును కల్పించకుండా రింతాడ, ముల్లుమెట్ట, కడుగులు, వంచులు మీదుగా జెర్రల–మెండిగెడ్డ గ్రామాల మీదుగా నడుపుతున్నారు. దీంతో చింతపల్లి నుంచి చౌడుపల్లి మీదుగా అడ్డుగా 10 కిలోమీటర్లులో జెర్రలు చేరుకోవాల్సిరది ఉండగా, అదనంగా 25 కిలోమీటర్లు చుట్టూ తిరిగిరావడంతో సమయంతో పాటు టిక్కెట్‌కు అధనంగా ఖర్చు అవుతుందని పలు గ్రామాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ రహదారుల గురించి ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మారని రోడ్డు దుస్థితి

చింతపల్లి మండల కేంద్రం నుండి 2 కిలో/మీటర్లు దూరంలో ఉన్నటువంటి చౌడుపల్లి పంచాయతీ కేంద్రం నుంచి పసువులుబంద గ్రామం మీదుగా జెర్రల వెళ్తున్న రోడ్డు పూర్తిగా రాళ్ల తేల, గోతులుమయమై పాడైపోయి ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదన స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాలకు ప్రధాన అనుసంధానంగా రాకపోకలు సాగిస్తున్న రోడ్డు చిన్న చినుకు పడితే చెరువులను తలిపించే విధంగా మారుతుంది. దీంతో చౌడుపల్లి పంచాయతీ పరిధిలో గల ఈదులుబయలు, చినకొత్తూరు, కొత్తవీధి, చెరువూరు, సామరవీధి, పసువులుబంద కాలనీ, గురుగూడెంతో పాటు అనేక గ్రామాలు ప్రజలు రాకపోకలు సాగించడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ ప్రాంతాలలో ఏ ఒక్కరికీ అనారోగ్యం పాలైనా ఈ గోతులు మయమైన రోడ్డు గుండానే ఆసుపత్రికి తరిలించాల్సిన పరిస్థితి.

రోడ్డు బాగు చేయాలి



చౌడపల్లి నుంచి పసువులుబంద ప్రయాణం చేయడానికి నరకం అనభవిస్తున్నాం. రోడ్డుకు ఎటువంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నాం . ఎన్నో మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలి

– దేవూరి పండు, పసువులుబంద గ్రామం



మొండిగెడ్డలో రాళ్లు తేలిన రహదారి

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



రాజవరంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న చిన్నబాబు

గంగవరం: మండలంలోని రాజవరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చిన్నబాబు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ మంద కృష్ణ మూడు దశాబ్దాలకు పైగా ప్రజా సమస్యలపై ఎనలేని పోరాటం చేస్తూన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావంతో ప్రజలను చైతన్యపరుస్తున్నారన్నారు. జూలై 7న ఎమార్పీఎస్ ఆవిర్భావి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామంలో జెండా ఎగురువేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

గంగవరం : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఎస్‌బీఐ పనిచేస్తోందని గంగవరం బ్రాంచ్ మేనేజర్ ఎస్.రత్నరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. బ్యాంకు వేళాలతో పనిలేకుండా అన్ని సమయాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఖాతాదారుల సేవా కేంద్రం ద్వారా వినియోగదారులకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులో ఉంచామన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాష్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ చొరవతో చిన్నారి వైద్యానికి తరలింపు



రంజితను వైద్య సేవలకై అంబులెన్స్‌లో తరలిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ లంగాబపోదోర్ గ్రామానికి చెందిన కొర్ర రంజిత (6)అనారోగ్యంతో బాధపడుతున్నా ఆస్పత్రికి తీసుకొని వెళ్లకుండా చిన్నారి తల్లిదండ్రులు శంకర్‌రావు, బుదోయ్‌లు నిర్లక్ష్యంగా ఉన్నారు. ఆస్పత్రికి చిన్నారిని తీసుకొని వెళ్లాలని వైద్య సిబ్బంది ఎంత చెప్పినా తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి సోమవారం లంగాబపోదోర్ గ్రామానికి వెళ్లి చిన్నారి రంజిత అనారోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులకు నచ్చజెప్పి, వైద్య సేవలకు తీసుకొని వెళ్లేందుకు ఒప్పించారు. లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి అంబులెన్స్‌ను లంగాబపోదోర్‌కు రప్పించి, చిన్నారిను లబ్బూరు పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సేవలు అందిస్తున్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి చూపిన చొరవపై గ్రామ గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఊరికీ సాయం



సమావేశంలో మట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయ

కూనవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2022లో వచ్చిన గోదావరి వరదలకు 16 పంచాయతీల్లోనూ వరద సాయం అందించిందని, గత సంవత్సరం వచ్చిన వరదలలో కూటమి ప్రభుత్వం ఐదు పంచాయతీలకు వరద సాయం ఇవ్వకుండా ఎగనామం పెట్టిందని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ విమర్శించారు. జగ్గవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంతమంది టీడీపీ నాయకులు నిత్యం ప్రజలతో మమేకమై ఉండే మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌లను విమర్శిస్తున్నారని, ఇది తగదన్నారు. 2022 గోదావరి వరదలలో ప్రతీ ఇంటికి రూ.2000 వరద సాయం, నిత్యావసర సరకులు, ఇంటింటికీ టార్పాలిన్లు, దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిఅహారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిందని గుర్తుచేశారు.

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ఏడాది గడిచినా ఒక్క పథకం కూడా సక్రమంగా అందించలేదని విమర్శించారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు, ఒక్కటి అందితే ఒట్టు, తల్లికి వందనం ఎటు పోయిందో తెలియదు, అన్నదాత సుఖీభవా అన్న లేదు దాతా లేదు అన్న చందంగా ఉందని విమర్శించారు. సర్పంచ్‌లు కారం పార్వతి, కట్టం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు నాగరాణి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియాదాస్, రాష్ట్ర ఎస్టీ సెల్ సభ్యుడు గుజ్జాబాబు, రైతు విభాగం అధ్యక్షుడు ఎస్.కొండలరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్, దీకొండ గంగాధరరావు, మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు లక్ష్మణరావు, పూర్ణ, యూత్ లీడర్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి దారితో సతమతం



పెదబయలు సంతకు వెళ్లే చిత్తడి దారిలో కురుకుపోయిన ఆటో

పెదబయలు: మండల కేంద్రంలోని వారపు సంతకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారపు సంత ఆవరణకు వెళ్లేందుకు ఎలాంటి రోడ్డు సదుపాయం లేదు. ఇక్కడికి చేరేందుకు మట్టి రోడ్డు ఉంది.అయితే ఇటీవల కురసిని వర్షాలకు ఈ మార్గం బురదగా మారి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంది. ఈ దారిలో వెళ్తున్న వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం సంతకు వెళ్లిన ఆటోలు ఇతర వాహనాలు బురదలో కూరుకుపోయాయి. సంత ప్రాంతానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదని ఆ ప్రాంతంలో డ్రైనేజీలు లేవని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మోకాల్లోతూ బురదలో సంతకు వెళ్లాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు లేని కారణంగా లారీలు, వ్యాన్లు కొంత దూరంలో ఆపాల్సి వస్తుందని, అక్కడ నుంచి లగేజీ మోసుకోవడం అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతకు సిసి రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని వ్యాపారులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు



గూనలంకలో తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఈఈ నాగేశ్వరరావు

చింతపల్లి/గూడెం కొత్తవీధి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో 106 కోట్లతో జల్‌జీవన్ మిషన్ రక్షిత మంచినీటి పథకాల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు పాడేరు ఆర్‌డబ్లుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.వి.వి.నాగేశ్వరరావు అన్నారు.ఆయన సోమవారం చింతపల్లి జీకే వీధి మండలాల్లో నిర్మాణంలో ఉన్నటువంటి పలు తాగునీటి పథకాలను ఆయన పరిశీలించారు.అనంతరం చింతపల్లి, జీకేవీది.కొయ్యూరు మండలాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో 650 తాగునీటి పథకాలు నిర్మాణాలు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా అందించే విధంగా పనులు పూర్తి చేశామన్నారు.అదే విధంగా మరో 120 గ్రామాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఇప్పటికీ 312 గ్రామాల్లో పనులు టెండర్ ప్రక్రియ పూర్తయందన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నటువంటి పనులను వేగవంతంగా పూర్తి చేసి మంచినీటి సరఫరా చేయాలని ఆదేశించామన్నారు. చింతపల్లి డీఈఈ కరుణ, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు ఏఈలు సాయికృష్ణ,వి.కళ్యాణ్‌రావు, స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే మంచి గౌరవం

హుకుంపేట: అంకిత భావంతో పనిచేస్తే మంచి గౌరవం ఉంటుందని సర్పంచ్ పాంగి బేసు, ఎంపిటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మంలంలోని తీగలవలస పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్తుండడంతో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ బేసు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసే విధానంలో సిబ్బంది మంచి పాత్ర పోషించారన్నారు. వారి సేవలను కొనియాడారు. వార్డు సభ్యులు కామేశ్వరరావు, శంకర్ రావు, చిరంజీవి, పీసా కమిటి సభ్యులు కొండ బాబు ,చిరంజీవి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

10న పేరెంట్స్ మీట్



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల: మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం జూలై 10న నిర్వహించాలని మండల పరిషత్ అధికారి డేవిడ్‌రాజ్, తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, ఎంఈవో సీహెచ్.బాబూరావుపడాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలంలో అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల, కళాశాలలో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు తప్పకుండా హాజరుకావాలన్నారు. సమావేశం గురించి ప్రధానోపాధ్యాయులకు వారు వివరించారు.

నీరు తొలగించారు.. దారి కల్పించారు



బీసీకాలనీ డ్రైనేజీ పూడిక పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు



వేగితోట జంక్షన్ వద్ద బోరింగు చుట్టూ చేరిన మురుగునీటిని తొలగిస్తున్న దృశ్యం



సినిమాహాలు ముందు రహదారిపై ఉన్న మట్టిని తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

చింతూరు: మండల కేంద్రంతో పాటు ఎర్రంపేటలో పలుచోట్ల నిలిచిపోయిన వర్షపునీటిని పొక్లెయిన్, ట్రాక్టర్ల సాయంతో పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈ నెల నాలుగో తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'నీరు నిలిచిందిలా నడిచేదెలా' అనే శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు సోమవారం ఈ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వేగితోట జంక్షన్ వద్ద బోరింగు చుట్టూ నిలిచి ఉన్న మురుగునీటిని డ్రైనేజీలోకి వెళ్లేలా పారిశుధ్య కార్మికులు పూడికను తొలగించారు. సినిమా హాలు ముందు నుంచి పోస్టాఫీసు వరకు రహదారిపై వదిలేసిన డ్రైనేజీ పూడికను పొక్లెయిన్‌తో సాయంతో తొలగించారు. దీంతో పాటు బీసీ కాలనీలో వర్షపునీరు నిలిచి నడిచేందుకు ఇబ్బందిగా మారిన మట్టిని పొక్లెయిన్‌తో తొలగించడంతో పాటు డ్రైనేజీలో పూడిక తీయించారు. దీంతో వర్షపునీరు రహదారుల పై నుంచి తొలగడంతో రాకపోకలు సుగమయ్యాయి. మరోవైపు ఎర్రంపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదుట నిలిచి ఉన్న వర్షపునీటిని తొలగించి దోమలు వ్యాప్తిచెందకుండా బ్లీచింగ్‌ను చల్లారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శ ప్రసాదరావు పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

చింతూరు విద్యార్థులకు పతకాల పంట



పతకాలు సాధించిన చింతూరు విద్యార్థులు

చింతూరు: రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన తూర్పు గోదావరి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో చింతూరు వీరభద్ర పవర్‌జిమ్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి 12 పతకాలు సాధించారు. అండర్–13 విభాగంలో ఉయిక సంతోష్, గోలి వీరజస్వంత్, జూనియర్ విభాగం మహిళల 86ప్లస్ కిలోల కేటగిరీలో గుత్తుల మధుచందన, పురుషుల 60 కిలోల కేటగిరీలో మైసా రోహిత్, 78 కిలోల కేటగిరీలో మైసా రాహుల్ బంగారు పతకాలు సాధించారు. సీనియర్ విభాగం 88 కిలోల కేటగిరీలో గొంపా సాయికిరణ్, 94 కిలోల కేటగిరీలో లక్ష్మీగణేష్ బంగారు పతకాలు సాధించారు. జూనియర్ విభాగం పురుషుల 65 కిలోల కేటగిరీలో శీలం త్రిశాంత్ సిల్వర్, సీనియర్ విభాగం 60 కిలోల కేటగిరీలో ధనరాజు సిల్వర్, 65 కిలోల కేటగిరీలో గరగా రాము సిల్వర్, 71 కిలోల కేటగిరీలో శీలం సాయి చంద్ సిల్వర్, 78 కిలోల కేటగిరీలో గొంపా రాము బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ గోలి గంగాధర్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు.

అటవీ ప్రాంతంలో మాయమవుతున్న టేకుచెట్లు



అక్రమార్కులు టేకు చెట్లు నరికి తరలించుకొని పోగా కొత్తగా చిగురిస్తున్న టేకు మోడు

విచారణ చేపట్టిన అటవీ అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట రక్షిత అటవీప్రాంతంలో విలువైన టేకు చెట్లు మాయమవుతున్నాయి. ఈ ప్రాంతంలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్ పరిసరాల్లోని పచ్చని అడవిలోని ఏపుగా ఎత్తుగా పెరిగి పక్వానికి వచ్చిన టేకు చెట్లను అక్రమార్కులు మొదలుకంటూ నరికి కాజేస్తున్నారు. సంబంధిత అటవీ సిబ్బంది ఈ వ్యవహారాన్ని చూసీచూడనట్టుగ వ్యవహరిస్తుండడంతో కొన్నేళ్లుగా అక్రమార్కుల కలప తరలింపునకు అడ్డు అదుపులేకుండా పోతోందని స్థానికులు చెబుతున్నారు. కాగా టేకు చెట్లు మాయమవుతున్నాయన్న సమాచారం మేరకు, స్థానిక అటవీ క్షేత్రాధికారి ఆదేశాల మేరకు రాజవొమ్మంగి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాము సోమవారం తమ సిబ్బందితో పాటు వెళ్లి విచారణ జరిపారు. టేకు కలప తరలిపోగా అక్కడ ఆనవాలుగా మిగిలిన టేకు చెట్ల మోళ్లను, దుంగలను లెక్కించి నివేదకను అటవీ ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్టు రాము 'సాక్షి'తో చెప్పారు. ఇకపై ఇక్కడ విలువైన కలప అక్రమార్కుల పాలు కాకుండా తగిన చర్యలు తీసుకొంటామన్నారు.



టేకు చెట్లును నరికి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన కలప